కథ

# రహస్యం

– జి.వై.వి. శర్మ

**నీరజ, విద్యార్థినిగా బి.ఎ.లో చేరిన సంవత్సరమే కృష్ణమూర్తి, అదే కాలేజిలో లెక్చరరుగా చేరాడు. ఆమె తన మేనమామ గారింట వుండి చదివేది.**

**కృష్ణమూర్తి, నీరజ క్లాసుకు, ఇంగ్లీషు పొయట్రీ చెప్పేందుకు వచ్చేవాడు. మంచి అందగాడు. అందమైన నొక్కుల జుత్తు. తెల్లని మేనిఛాయ. రంగు రంగుల చొక్కాలను, తెల్లని ప్యాంట్లలో 'టక్' చేసికొని, క్లాసుకొచ్చే 'కృష్ణమూర్తి' అందరికి పెద్ద 'హీరో'లా కన్పించేవాడు**

గంభీరమైన కంఠస్వరంతో అతను పాఠం చెపుతోంటే విద్యార్థులంతా, చాలా ఆసక్తిగాను, విద్యార్థినులంతా ఆరాధనా భావంతోను వినేవారు. పాఠం చెపుతూ చెపుతూ మధ్య మధ్య జోక్సు వేస్తూ స్టూడెంట్సును ఆకట్టుకొనే వాడు కృష్ణమూర్తి.

సంవత్సరం గడిచేపాటికి కృష్ణమూర్తికి 'సమర్థుడైన లెక్చరరు' అనే పేరొచ్చింది. అతని క్లాసంటే విద్యార్థులెవ్వరు గైర్హాజరయ్యేవారు కాదు.

నీరజ, మేనమామ భార్య కృష్ణమూర్తికి దగ్గర బంధువవ్వటం - వాళ్ళింటి ప్రక్క డాబాలోనే కృష్ణమూర్తి నివాసముండటం, నీరజ కృష్ణమూర్తులు ఒకరికొకరు దగ్గరవ్వటానికి దోహదపడింది. నీరజ బి.ఎ. అయ్యేపాటికి వాళ్ళిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగి, అది పెండ్లి వరకు దారితీసింది.

పెద్దల అనుమతితోనే వాళ్ళిద్దరు దంపతులయ్యారు. పెండ్లికొచ్చిన వారంతా మంచి జంట - 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అనుకొన్నారు. వాళ్ళ పెళ్ళి అయ్యాక కొంత కాలం హాయిగా గడచిపోయింది. ఓ సంవత్సరం గడచేక - ఓ సమస్య 'నీరజ'ను చాప క్రింద నీరులా చిన్నగా చుట్టుముట్ట నారంభించింది.

కాలేజి, సాయంత్రం అయిదు గంటలకు అయిపోతుంది. అయిదున్నరలోపే కృష్ణమూర్తి ఇంటికొచ్చేస్తాడు. ఇద్దరూ 'టీ' తాగి ఆ కబుర్లు, ఈ కబుర్లు చెప్పుకొంటూ గడిపేస్తారు. ఆ తర్వాత సరదాగా ఏ షాపింగుకో, స్నేహితుల ఇండ్లకో, ఒక్కోసారి సినిమాకో - లేకుంటే ఏ పార్కుకో వెళ్ళి సాయంత్రాలను గడిపేస్తారు.

అలాంటిది ఈమధ్య కృష్ణమూర్తి ఈ దినచర్యలో ఎందుకో మార్పు వచ్చింది. సాయంత్రం అయిదున్నర కల్లా ఇంటికి వచ్చే కృష్ణమూర్తి అప్పుడప్పుడు ఆలస్యంగా, ఏ ఎనిమిదింటికో రావడం మొదలెట్టాడు.

స్పెషల్‌క్లాసులని ఒకసారి, కాలేజి స్టాఫ్ మీటింగని మరోసారి, టేబుల్‌టెన్నిస్ ఆట ఆడుతూ ఆలస్యమయిందని మరోసారి చెప్పడం ప్రారంభించాడు.

నీరజ మొదట్లో అంతగా పట్టించుకోకపోయినా, ఇంటిలో తనకు మిగిలిపోతున్న ఒంటరితనం, భారంగా తోచడంతోను... వారం రోజులలో అప్పుడప్పుడు ఆలస్యంగా వచ్చే కృష్ణమూర్తి ఆ తర్వాత తర్వాత తరచుగాను, ఆపై ప్రతిరోజూ ఆలస్యంగా రావడం, కారణం అడిగితే, సరైన సమాధానం చెప్పక - 'మగవాళ్ళకు సవాలక్ష పనులుంటాయి' అంటూ విసుక్కోవడం మొదలెట్టేసరికి, నీరజకు కృష్ణమూర్తి ప్రవర్తనపై చిన్నగా అనుమానం మొదలయింది.

అనుమానం మొదలవ్వాలే కాని - ఆలోచనలు బహుపుంతల సాగిపోతాయి కదా! అతడు చెపుతోన్న కాలేజీలో స్పెషల్ క్లాసులు, టెన్నిస్ ఆడటం, స్టాఫ్ మీటింగులు అంతా వట్టిదే అనుకొంది.

ఈయనగారు కాని 'బార్'కు వెళ్ళడం ప్రారంభించేరా... లేక పేకాట 'క్లబ్'కు అలవాటు పడ్డారా అనే అనుమానం పొడచూపింది నీరజలో.

ఒకనాడు తనతో బి.ఎ. చదివిన 'సునంద' సూపర్‌బజారులో కన్పించి- 'అవునే నీరజా? గుంటగ్రౌండ్సులోని ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో మీ ఆయన, చుట్టూ మరికొందరు గరల్ స్టూడెంట్స్ కనిపించారు... నీవు రాలేదేమే' అని అడగడంతో...

'ఈయనగారు అమ్మాయిలను వెంటేసుకు తిరుగుతున్నారన్నమాట' అని మొదటిసారిగా అనుకొంది నీరజ. ఆ క్షణం నుండి కృష్ణమూర్తి కదలికల మీద నీరజ నిఘా ప్రారంభమయింది.

ఇదివరలో కాఫీ తాగి, పడక గదిలోనే పేపరు చూసే కృష్ణమూర్తి ఈమధ్య పేపరు తీసికొని డాబా మీదకు వెళ్ళి అక్కడ పేపరు చూడడం వెనకాల వున్న అసలు కారణం మరేమీ కాదు- తన మేనమామ గారు ఖాళీ చేసి పోయిన ఆ పక్క డాబాలోకి వచ్చిన ఆర్.డి.ఓ. గారి అమ్మాయి ఆ వేళప్పుడు, ఆ డాబాపై పచార్లు చేస్తూ మధ్య మధ్య కృష్ణమూర్తికేసి చూడటమే అని తన నిఘా వలన తెలిసికోగలిగింది నీరజ.

ఆ ఆర్.డి.ఓ. గారి అమ్మాయి, కాలేజీలో కృష్ణమూర్తి క్లాసు స్టూడెంటే. అప్పుడప్పుడు కృష్ణమూర్తి దగ్గరకు గ్రామరు 'డౌట్స్' అంటూ తమ ఇంటికి వస్తూ వుంటుంది.

నీరజకు తాను స్టూడెంటుగా వుండగా తానూ, అలాగే, తన మేనమామ గారింటి డాబాపై పచార్లు చేయడాన్ని కృష్ణమూర్తి చూడటం తనకు చేతులూపి సౌంజ్ఞలు చేసి ప్రేమ సందేశాలు పంపడం జ్ఞాపకం వచ్చి అప్పటివరకు అనుమానంగా వున్న కృష్ణమూర్తి ప్రవర్తనలోని వంకరేమిటో ధృఢమయింది.

అయినా నీరజ తొందరపడి కృష్ణమూర్తిని ఏమీ అడగలేదు. ఒకనాడు, పాలు పోసే అమ్మాయి, పాలు పోసి- 'అమ్మగారూ? రాత్రి సినిమా హాలుకి అయ్యగారితో ఆ చిలుకాకుపచ్చ రంగు సిల్కుచీరె కట్టుకొచ్చిన ఆ అమ్మాయి గారెవరండి- తమరి చుట్టాలా' అని అడిగింది.

నీరజ నిరుత్తర అయి తెల్లబోయింది. మరుక్షణం తేరుకొని, ఆ పాలమ్మాయిని డాబా మీదకు తీసికొని వెళ్ళి - పక్క డాబామీద పచార్లు చేస్తోన్న ఆర్.డి.ఓ. గారమ్మాయిని చూసి- 'ఆ అమ్మాయేనా' అని అడిగింది.

'ఈ అమ్మాయిగారు కాదండి. ఈ అమ్మాయి గారు నాకెందుకు తెలవదండి. ఆరింట్లో కూడ పాలు పోసేది నేనే గదండి. ఇంతకంటె కొంచెం ఎత్తరండామె. మెడల మీదకు జుట్టు కత్తిరించుకొందండి' అంది.

నీరజకు ఆమె ఎవరో వెంటనే స్ఫురించింది. కొత్తగా కాలేజి లెక్చరరుగా చేరిన 'మైథలి'!




అయితే, ఈయనగారు గోపికాలోలుడిలా పలు రమణీమణులతో రాసక్రీడ సాగిస్తున్నారన్నమాట' అనుకొంది నీరజ కోపంగా. ఇహ కృష్ణమూర్తి చర్యల్ని సహించగల సహనాన్ని కోల్పోయింది. ఆ క్షణాన్నే కృష్ణమూర్తిని నిలదీసి ప్రశ్నించాలనుకొంది.

కానీ కృష్ణమూర్తి ఆ సమయాన ఇంట్లో లేడు. మార్నింగ్ వాక్‌కు బయటకు వెళ్ళాడు. నీరజకు మనసంతా వికలమయింది. ఏ పనీ చేయవేయబుద్ధి కాలేదు. మనసు కోపంతో, పొగలు కక్కుతోంది. పని మనిషి కావేరికి అంట్లుపడేసి, స్నానాల గదిలో గీజరు ఆన్ చేసి వచ్చి మళ్ళీ పడక గదిలో కళ్ళు మూసికొని పడుకొంది- కృష్ణమూర్తి రాకకోసం ఎదురుచూస్తూ.

బయట కృష్ణమూర్తి వచ్చిన చప్పుడయింది. పనిమనిషి 'కావేరి' తలుపు తీసిందిలా వుంది- స్నానం చేసేందుకు నేరుగా స్నానాల గదిలోకి వెళ్ళాడు కృష్ణమూర్తి. అతనితో, ఏమి, ఎలా మాట్లాడాలో తర్కించుకోవడం మొదలెట్టింది నీరజ తనలో తానే!

పావుగంట గడచింది కృష్ణమూర్తి స్నానాల గదిలోకి మరో పది నిమిషాలూ గడిచింది. స్నానాల గదిలో ఇంతసేపేమిటి చేస్తున్నట్టు? నీరజ లేచి కిచన్‌లోకి వెళ్ళింది. అక్కడి కిటికీ ద్వారా చూస్తే పెరటిలోని స్నానాల గది కన్పిస్తుంది. స్నానాల గది తలుపు మూసే వుంది. లోపల నీళ్ళ చడీ చప్పుడు లేదు. లోపల కృష్ణమూర్తి ఇంకా స్నానం చేస్తున్నాడా... సగం మూసి వున్న కిటికీ గుండా అలానే చూస్తూ వుండిపోయింది నీరజ.

మరో అయిదు నిమిషాలు గడిచేక పనిమనిషి



## జెంట్స్ దుస్తులకి సోనాలీ మోడలింగ్!

నిన్నటి దాకా సబ్బు ప్రకటనల్లో కనిపించిన సోనాలీ బింద్రే, ఇప్పుడు జెంట్స్ వేసే దుస్తులకు ఇచ్చే ప్రకటనలలో నటిస్తోంది. బి.ఎస్.ఎల్. లిమిటెడ్ సూటింగ్స్, షర్టింగ్స్‌కి మోడల్‌గా దర్శన మిస్తోంది. 'అందం చూడవయా (ఎవరిదీ? ఆ సూట్‌దా, సోనాలీదా?) మా సూటింగ్స్ కొనుక్కో వయా' అంటూ ఆ కంపెనీకి ప్రకటన లివ్వడం తెలిసి అంతా డబ్బు సంపాదనకి ఎన్ని మార్గాలో అనుకుంటున్నారు.

'కావేరి' స్నానాల గది నుండి బయటకు వచ్చింది. అటు ఇటూ బిత్తర బిత్తరగా చూచుకొంటూ పంపు దగ్గర అంట్ల ముందు కూర్చుండిపోయి, వాటిని కడ గడంలో మునిగిపోయింది.

ఆ తర్వాత కృష్ణమూర్తి- స్నానాల గది నుండి బయటకు వచ్చాడు తలను తుండుగుడ్డతో తుడుచు కొంటూ.

ఆ దృశ్యం చూచేక నీరజ ఒళ్ళు భగ్గున మండి పోయింది.

'ఛీ! ఛీ! చివరకు ఈయన పనిమనిషితో కూడా... ఇంత నీచానికి దిగజారేరా... నీరజకు అవమానంతో ఒళ్ళంతా ప్రకంపన మొదలయింది. క్షణం కూడా అక్కడ నిలవలేక పడక గదిలోకి వెళ్ళి మంచం మీద వాలిపోయింది- ఎగిసి వస్తోన్న కోపాన్ని, దుఃఖాన్ని తొక్కిపెడుతూ.

డ్రస్ చేసికొన్న కృష్ణమూర్తి నీరజ వున్న పడక గదిలోకి వచ్చి... ''ఏమిటి ఇంకా పడుకొనే వున్నావా... ఏం రాత్రి సరిగా నిద్ర పట్టలేదా...'' అన్నాడు.

నీరజ మాట్లాడలేదు.

నేను ప్రిన్సిపల్ గారింటికి వెళుతున్నాను వాళ్ళ అమ్మాయి నిశ్చయ తాంబూలాలు. బ్రేక్‌ఫాస్ట్- లంచ్ అక్కడే... తిరిగి రాక సాయంత్రమే'' అంటూ వెళ్ళి పోయాడు కృష్ణమూర్తి నీరజ సమాధానానికైనా ఎదురు చూడకుండా.

నీరజకు లేచి, అతన్ని అడ్డుకొని నిలతీద్దామని పించింది- కానీ, తానున్న ఆవేశంలో తానే ఎక్కడ 'బ్రేక్' అవుతానో అనిపించి ఆగిపోయింది. అంతే కాదు, ఆ క్షణాన కృష్ణమూర్తితో మాట్లాడటానికి అసహ్యంగా వుంది. తలగడలో తలదూర్చి అలానే వుండిపోయింది.

అలా ఎంతసేపు వుండిపోయిందో!

అంట్లు తోమి వెళ్ళబోతూ- 'వెళ్ళొస్తా నమ్మగారూ' అని పెరటిలోనుండే కేకేసి చెప్పి 'కావేరి' వెళ్ళిపోయింది. ఆ వెళ్ళిపోతోన్న 'కావేరి'ని పిలిచి, గట్టిగా నాల్గు చీవాట్లెట్టి పని మాన్పించేద్దాం అనుకొన్న నీరజ - 'అది ఎదురు తిరిగి ముందు మీ అయ్యగారికి బుద్ధి చెప్పుకోవమ్మా' అని అంటే తానేమి మాట్లాడ గలదు... అయినా అసలు సమస్య పనిమనిషి కాదు... కృష్ణమూర్తి బుద్ధిది.

ఏం చేయాలో ఆలోచనలో పడిపోయిన నీరజ కు చటుక్కున తన చిన్ననాట తన అమ్మ, అక్కడ 'కస్తూరి'తో అన్న ఒకమాట జ్ఞాపకానికి వచ్చింది. సంగతి, సందర్భం అవగాహన చేసికోగల వయసు తనకానాటికి లేకున్నా- అదేమిటో 'అమ్మ' అన్న ఆ మాట తన మనసులో నాటుకుపోయి వుంది ఈనా టికి. బహుశా, అక్కడ ఆనాడు ఎదుర్కొన్నది- ఇలాంటి సమస్యనేమో... ఆనాటి అక్క అమ్మల మధ్య సంభాషణ తనకీనాటికి స్పష్టంగా గుర్తే... తన వయసానాటికి పదేళ్ళు...

ooo

అమ్మ వంట ఇంటిలో కూరలు తరుగుతోంది. ఆమెకెదురుగా అక్క కస్తూరి కూర్చొని వుంది.

''చూడమ్మా కస్తూరి, ఇది మంచి, ఇది చెడ్డ అని చెప్పించుకోవలసినంత చిన్నపిల్లవేం కాదు నీవు. చదువుకొన్న దానివి. జ్ఞానం కలదానివి. నీ సమస్యను నీవే పరిష్కరించుకోవాలి. కావాలంటే చెప్పు, మాకు తోచిన సలహా ఇస్తాము. ఆపై నీ ఇష్టం'' అంది అమ్మ.

అమ్మ మాటలు విని ఏమీ అనలేదు అక్క. మౌనంగా వుండిపోయింది. ''జీవితమన్నాక- సంసార మన్నాక, ఏవో చిన్నా చితకా సమస్యలు వస్తూనే వుంటాయి. గోరంతల్ని కొండంతలు చేసికోకూ డదు. సమస్యలు ఎదురయినపుడు, మనం విచక్షణను కోల్పోకుండా ప్రశాంతంగా వాటి పూర్వాపరాలను పరిశీలించాలి, పరిష్కారమేదో కనుక్కోవాలి'' అని చెప్పుకపోతున్న అమ్మ మాటలకి అడ్డొస్తూ...

''ఏమిటమ్మా! ఇది గోరంత సమస్యేం కాదు. నా జీవితానికి, ఆత్మాభిమానానికి సంబంధించిన కొండంత సమస్య'' అంది అక్క ఆవేశంగా.

కూరలు తరగడం పూర్తిచేసిన అమ్మ కత్తిపీటను ఎత్తి పక్కకు పెట్టబోతూ- 'సరే! పెద్ద సమస్యే... దానికి పరిష్కారం కనుక్కోవాలి కాని... దీనితో గొంతు నరుక్కుంటామా...' అంది చేతిలోని కత్తి పీటను ఎత్తిచూపుతూ.

'నేనేం గొంతు నరుక్కుంటాను అనడం లేదు. ఆయనతో కుదరదు, తెగతెంపులు చేసికొంటాను అంటున్నాను. అంతే!' అంది.

అమ్మ చేతిలోని కత్తిపీటను, ఒక మూలాగా గోడ కాన్చి, ఓసారి ప్రశాంతంగా అక్కకేసి చూసి, 'నేనన్న దానికి, నీవనేదానికి అట్టే భేదం లేదులే' అంది.

''ఏమోనమ్మా! నా ప్రయత్నాలు నేను చేశాను. ఆయన్ను మార్చడం నా తరం కాలేదు, నేనేం చేయను'' అంది అక్క నిస్సహాయంగా.

అప్పుడంది అమ్మ- 'సమస్య ఒకవైపు నుండి పరిష్కరించడం సాధ్యం కాకుంటే - మరోవైపు నుండి నరుక్కురావాలి' అని.

అక్క ఆ మరునాడే తిరిగి వెళ్ళిపోయింది బావ దగ్గరకు.

ఆ తర్వాత అక్క అమ్మకు జాబు వ్రాసింది- 'అవునమ్మా సమస్యా పరిష్కారానికి, మరోవైపు నుండి కూడా ప్రయత్నించాలి. నా సమస్య తీరింది. నీ సలహాకు థ్యాంక్సు' అని.

ooo

ఆనాటి అక్క ఉదంతం జ్ఞాపకం రావడంతో నీరజ మనసున ఒక ఆలోచన మెరుపులా మెరసింది.

''అవును. ఈ విషయంలోనూ అటునుండే నరుక్కురావాలి'' అనుకొంది. అలా అనుకోవడమే తడవుగా ఒక్క ఉదుటున మంచం మీది నుండి లేచి పనిమనిషి 'కావేరి' కోసం చూసింది. అది ఆపాటికే ఆర్.డి.ఓ. గారి ఇంటిలోకి వెళ్ళిపోయింది పని చేసేందుకు.

మరో గంటకల్లా 'కావేరి' ఆర్. డి. ఓ. గారింటి నుండి బయటకు రావడం గమనించిన 'నీరజ' తప్పట్లు కొట్టి 'కావేరి' ని పిలిచింది.

కావేరి వచ్చింది.

''నీకేమయినా అర్జంటు పనుందా'' ప్రశ్నించింది నీరజ.

'అన్ని ఇండ్లలోను పనులయి పోయాయమ్మా! ఇంక ఇంటికి ఎళ్ళటమే'' అని 'ఏం, ఎందుకమ్మా' అంది 'కావేరి',

''మరేంలేదే... మనసేం బాగుండటం లేదు, ఆ కబురు, ఈ కబురు చెపుతూ సాయంగా వుంటావేమో అని'' అంది నీరజ.

కావేరి- 'అట్టాగేనమ్మా మద్దేలదాక వుంటాను' అంది.

నీరజ, కావేరితో కబుర్లు చెపుతూ, టిఫిన్ చేసింది. కావేరికి పెట్టింది. మళ్ళీ ఆ కబురు, ఈ కబురూ చెపుతూనే- కావేరికి, రహస్యం లాంటి తన మనసులోని మాట చెప్పి ''కావేరి! ఏదో మనసులోని కష్టం, దరిదాపుల్లో తల్లీ తోడు లేకపోవడంతో, తోటి ఆడదానివని నీతో చెప్పుకొన్నాను. ఎక్కడా అనకు-'' అని కళ్ళనీళ్ళు పెట్టుకొన్నంత పని చేసింది- నీరజ.

నీరజ చెప్పిన ఆ కబురు వింటూనే 'కావేరి' అవాక్కై, భయంతో వణికిపోయింది. ఎందుకో- ''ఇంకా నయం'' అనుకొంది మనసులో.

ooo

ఆ మరునాడే- 'ఇండ్లెక్కువయ్యాయి. పనిచేయలేకున్నాను' అంటూ నీరజ ఇంటి పని మానేసింది కావేరి.

తాను చెప్పిన రహస్యపు మనసులోని మాటను ఎక్కడా అనకు అందిగా నీరజ; కాని 'కావేరి' లాంటి మనిషికి అదెలా సాధ్యం. దాని ఒక్కనోరు పది నోర్ల పెట్టుగా పనిచేసింది, వారం తిరక్కముందే.

ఆర్. డి. ఓ. గారమ్మాయి డాబా మీది పచార్లు ఆగిపోయాయి. కాలేజి మాని, ఓపెన్ యూనివర్శిటి పరీక్షలకు కడుతోందిట.

మైథలీ లెక్చరరు నెల తిరక్కముందే, కాలేజిలో జాబ్‌కు రిజైన్ చేసి నెల్లూరు వెళ్ళి అక్కడేదో రెసిడెన్షియల్ కాలేజిలో చేరిందట. అదేమిటో. విచిత్రంగా అంతో ఇంతో పరిచయం వున్న, పరిచయాలు పెంచుకొంటున్న ఆడవాళ్ళంతా కృష్ణమూర్తికి ఆమడ దూరంగా జరిగిపోయారు.

కృష్ణమూర్తి ఇప్పుడు కాలేజి నుండి సాయంత్రం అం ఐదున్నరకల్లా ఇంటికి వచ్చేస్తున్నాడు. బుద్ధిగా నీరజ చుట్టూ పరిభ్రమిస్తున్నాడు.

ఇంతకూ నీరజ - కావేరికి చెప్పిన ఆ రహస్యపు మాటేమంటే- 'అయ్యగారిని ఈ మధ్య ఏదో నలతగా వుంటే- డాక్టరు గారి దగ్గరకెళ్ళారు. ఆయన రక్తాన్ని పరీక్షించిన డాక్టరుగారు- 'అయ్యగారి రక్తంలో ఏదో తేడా వుందని... ఎయిడ్స్ వ్యాధి వచ్చినా రావచ్చని అనుమానంగా వుందని అన్నారట. ఏం చెయ్యాలో అర్థం కావడంలేదే కావేరి!' అనిట.

''అయ్యగారైతే నన్ను పుట్టింటికి వెళ్ళు... నీవైనా సుఖంగా వుండు అంటున్నారు. అదెలా సాధ్యం చెప్పు. ఏమైతే మాత్రం... కట్టుకొన్న వాణ్ణి- కాదని పోగలమా. ఇక్కడే వుండి పోదలచుకొన్నాను'' అని కూడా అంది నీరజ.

ooo

సంవత్సరాలు గడచినా కృష్ణమూర్తికి అంత దూరంగానే వుసలుతున్నారు ఆడవాళ్ళంతా.

ఒకసారి 'దొంగ' అని పేరుపడి అలా పిలువబడ్డాక, ఆ తర్వాత అతనిలో ఎలాంటి దొంగలక్షణాలు కన్పించకున్నా అతన్ని అనుమానంగానే చూస్తుంది ఈ లోకం.

కావేరి యిచ్చిన పబ్లిసిటితో కృష్ణమూర్తి కథ అంతే అయింది.

## అక్షయ్, అమీర్‌ల పిచ్చాపాటి!

**అమీర్:** హబ్బ! ఈ వేళెంత హాయిగా ఉందో!

**అక్షయ్:** ఓహ్!

**అమీర్:** రాత్రి చాలా లేటు సమయం దాకా రిహార్సిల్స్ చేశా.

**అక్షయ్:** ఓహ్!


**అమీర్:** అందువల్లే ఇప్పుడు స్టెప్పులు సరిగ్గా వేయలేకపోయా.

**అక్షయ్:** ఓహ్!

**అమీర్:** నేనసలు ఈ షోపై బుర్ర పెట్టి పని చేయలేకపోతున్నా! ఏంటో?

**అక్షయ్:** ఈ షోలకంత బుర్ర వాడాల్సిన అవసరం ఉందా?

**అమీర్:** ఆ....!




రూ. 2,50,000/-లు విలువగల
బహుమతులు గెలుపొందండి (ప్రవేశరుసుము లేదు)

| | | |
|---|---|---|
| 6 | 5 | 10 |
| 11 | 7 | 3 |
| 4 | 9 | 8 |

సహాయంకోసం నమూనా

ప్రత్యేక బహుమతి: హీరో హోండా మోటార్ సైకిల్ (లేదా) కలర్ టి.వి.

| | | |
|---|---|---|
| 8 | | |
| | 9 | |
| | | 10 |

**కన్సోలేషన్ బహుమతులు:** మ్యూచువల్ బెనిఫిట్ చెయిన్‌లింక్ పథకము క్రింద టూ-ఇన్-వన్, ట్రాన్సిస్టర్, ఫోటోగ్రాఫిక్ కలర్ కెమెరా, చేతిగడియారం. ఇచ్చిన నమూనా ప్రకారం 9 ఖాళీ చదరాలు గీయండి. 5 నుండి 13 వరకు గల అంకెలనుపయోగించి నిలువుగా, అడ్డముగా ఏటవాలుగా ఎటుకూడినా మొత్తం '27' వచ్చేలా చూడండి. ఒక అంకె ఒకేసారి ఉపయోగించాలి. ఆర్డినరీ మెయిల్ ద్వారా కాంపిటీషన్ పోస్ట్‌కార్డ్/ఇన్‌లాండ్/ఎన్వలప్ పైన 10 రోజులలోగా పంపించాలి. మొదటగా స్వీకరించిన 20 ఎంట్రీలకు టైటాన్ చేతి గడియారం ఉచితంగా బహూకరించబడును.

**S.KUMAR & COMPANY** (WAJ) Vasundhara, NEW DELHI - 110096

